సాక్షి నిర్మల్
సోమవారం : 10 : జూన్ : 2024



తెలుగు-ఆంగ్లం సమేతంగా..

పదో తరగతి విద్యార్థులకు ద్విభాష పాఠ్యపుస్త కాలు పంపిణీ చేయనున్నారు. గతంలో 9వ తర గతి వరకు ఈ పుస్తకాలు పంపిణీ చేశారు.

2లో▸



గుంత.. తీర్చేను నీటి చింత

భూగర్భజలాలను పెంచేందుకు ప్రభుత్వం ఇం కుడుగుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో మురుగు కాల్వల చివరన సామూ హిక ఇంకుడు గుంతలను నిర్మిస్తోంది.

3లో▸

గరిష్టం/కనిష్టం
36.3 /26.3

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవ కాశం ఉంది.

న్యూస్‌రీల్

దత్తాత్రేయను కలిసిన ఎమ్మెల్యే రామారావు పటేల్



జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: ఎమ్మెల్యే పి రామారావు పటేల్ రెండురోజులుగా ఢిల్లీలో బిజీగా గడుపుతున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌తో పాటు బీజేపీ ప్రముఖులను కలుస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మోదీ మూడోసారి ప్రధాని బాధ్యతలు చేపట్టడంపై నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

కూచిపూడి నృత్యంలో చిన్నారుల ప్రతిభ



పురస్కారాలతో చిన్నారులు

నిర్మల్‌ఖిల్లా: దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో ఆదివారం శ్రీ జగన్నాథ నృత్య కళోత్సవం నిర్వహించారు. జిల్లాకు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య అభినయం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పూరి జగన్నాథస్వామి పుణ్యక్షేత్ర సన్నిధిలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత నవ్య వినయ్ పర్యవేక్షణలో పలువురు బాలికలు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం నిర్వాహకులు, వీక్షకులను అలరించింది. చిన్నారులకు కళోత్సవ నిర్వాహకురాలు లలితారావు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అద్భుతమైన నాట్య ప్రతిభ కనబరిచిన చిన్నారులను పలువురు అభినందించారు.

'ఉద్యమకారులను గుర్తించాలి'

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టె శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటిస్థలం, పెన్షన్ సౌకర్యం, బస్సులో ఉచిత ప్రయాణం, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు కలీమ్ అహ్మద్, సాయన్న, గోపి, గంగన్న, షరీఫ్, సుధీర్‌సింగ్, వెంకటరమణ, శంకర్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

'నీట్ రద్దు చేయాలి'

నిర్మల్‌టౌన్: ఈ నెల 4న విడుదలైన నీట్ యూజీ–2024 పరీక్ష ఫలితాలు తప్పుడుగా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేష్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. 67 మంది విద్యార్థులకు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు వస్తే అందులో ఎనిమిది మంది ఒకే సెంటర్‌కు చెందిన వారు ఉండడం గమనార్హమన్నారు. పాట్నా, గుజరాత్ లాంటి అనేక ప్రాంతంలో పేపర్ లీక్ అయిందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇది దేశంలోని అతిపెద్ద పరీక్ష స్కామ్‌గా మారిందన్నారు.

సెల్ఫీకోసం వెళ్లి ఇంటర్ విద్యార్థి గల్లంతు..!



పవన్ కుమార్ (ఫైల్)

భైంసాటౌన్: ముగ్గురు స్నేహితులు సరదాగా సెల్ఫీ కోసం వెళ్లి ప్రమాదవశాత్తు ఓ యువకుడు నీటిలో మునిగి గల్లంతైన ఘటన భైంసా పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... ఏపీనగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి సోలంకి పవన్‌కుమార్ (17), లోలాపూర్ శివకార్తీ, అవదూత్‌వార్ సూర్యవంశి ముగ్గురు కలిసి ఆదివారం సాయంత్రం పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టును ఆనుకుని ఉన్న పార్క్ సమీపంలో బండపై కూర్చుని సెల్ఫీ దిగుతుండగా సూర్యవంశి చెప్పు నీటిలో పడిపోయింది. దీంతో చెప్పు తీసేందుకు సోలంకి పవన్‌కుమార్, శివకార్తీ నీటిలో దిగారు. లోతు ఎక్కువగా ఉండడం, ఈత రాకపోవడంతో నీటిలో గల్లంతయ్యారు. గమనించిన స్థానికుల్లో ఒకరు శివకార్తీని నీటిలో నుంచి బయటికి తీశారు. పవన్‌కుమార్ దొరకకపోవడంతో నీటిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పవన్‌కుమార్ మృతదేహం కోసం గాలించినా చీకటి పడడంతో సోమవారం ఉదయం మరోసారి గాలింపు చేపట్టనున్నారు.

మీన మేషాలు



చెరువులో చేపలు పడుతున్న జాలరి (ఫైల్)

- చేప పిల్లల పంపిణీపై నీలినీడలు
- నేటికీ ఊసేలేని టెండర్ల ప్రక్రియ
- గతేడాది ఏప్రిల్‌లోనే పూర్తి
- ఏ నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- పథకం అమలుపై స్పష్టత కరువు
- ఆందోళనలో మత్స్యకారులు

నిర్మల్‌చైన్‌గేట్: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా మత్స్యకారులకు పైసా ఖర్చు లేకుండా టెండర్ల ప్రక్రియలో కాంట్రాక్టర్ చేప పిల్లలను గ్రామాల్లోకి తీసుకొచ్చి చెరువుల్లోకి వదిలేలా ఏర్పాట్లు చేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలుపై ఇప్పటి వరకూ ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది. ఏటా టెండర్ల ప్రక్రియ ప్రారంభించే సమయం కావడం, దీనిపై రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఎలాంటి సమావేశాలు నిర్వహించకపోవడంతో ఉచిత పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో టెండర్ల ప్రక్రియ, పంపిణీ సమయంలో భారీగా అవినీతి చోటు చేసుకుంటోందని ప్రస్తుత ప్రభుత్వం భావించి పథకం అమలుపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోనట్లు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి

జిల్లాలోని 18 మండలాల్లో మొత్తం నీటి వనరులు ఉన్న చెరువులు, కుంటలు 529 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 214 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. మత్స్యకార వృత్తిపై సుమారు 10,253 మంది మత్స్యకారులు, వారి కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధిపొందుతున్నారు. చేపలు పట్టడం, వాటిని విక్రయించడం ద్వారా ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నారు. గతేడాది ప్రభుత్వం 529 చెరువుల్లో 4.02 కోట్ల చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని ప్రారంభించింది. బొచ్చ, రవ్వ, బంగారు తీగ వంటి రకాల చేప పిల్లలు చెరువుల్లోకి వదిలారు.

సందిగ్ధం

ఈ ఏడాది ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీపై ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో పథకం అమలుపై సందిగ్ధం నెలకొంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేస్తుందా? లేదా? అన్న సందేహాలు మత్స్యకారుల్లో తలెత్తుతున్నాయి. యధావిధిగా పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు

ఏదీ టెండర్ ప్రక్రియ?

ఏటా మార్చి లేదా ఏప్రిల్ నెలలోనే చేప పిల్లల కొనుగోలు కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచేది. వర్షాలు కురిసి చెరువుల్లో నీరు చేరితే ఆగస్టులో మత్స్యకారులకు ఆ శాఖ అధికారులు వందశాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేసేవారు. ఈ ఏడాది మే నెల పూర్తయినా నేటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. చేప పిల్లల కొనుగోలుకు టెండర్ పిలవాల్సి ఉన్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వివరాలు

జిల్లాలో నీటి వనరులు	529
మత్స్య కార్మిక సంఘాలు	214
సభ్యుల సంఖ్య	10,153

2023లో చేప పిల్లల పంపిణీ లక్ష్యం 4.02 కోట్లు

ఆలస్యం చేస్తే నష్టమే...

ఏటా జిల్లాలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో చేప పిల్ల ల పంపిణీ కార్యక్రమం నిర్వహించేవారు. అప్పటి వరకు వర్షాలు పుష్కలంగా కురిసి చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉంటుంది. ఆ సమయంలో చేప పిల్లలు వదిలితే అవి ఎదిగేందుకు అవకాశం ఉండడంతో పాటు, ఎదిగిన చేపల విక్రయాల ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా లబ్ధి పొందుతారు. ఆలస్యం చేస్తే చేపలు ఎదగడం కష్టంగా మారుతుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. కాంట్రాక్టర్లు నాసిరకం చేప పిల్లలు పంపిణీ చేస్తున్నారని, దీంతో అవి సరిగా ఎదగడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం మత్స్యసహకార సంఘాలకు ఉచిత చేప పిల్ల ల పంపిణీకి బదులు నగదు బదిలీ పథకాన్ని చేపడితే బాగుంటుందనే అభిప్రాయం మత్స్యకారుల నుంచి వ్యక్తమవుతోంది.

పంపిణీకి చర్యలు చేపట్టాలి



ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీకి చర్యలు చేపట్టాలి. టెండర్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి. మత్స్యకారుల సంపద పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

– జింక సూరి, మత్స్య కార్మిక సంఘం నాయకుడు

ఆదేశాలు రాగానే ..



ఉచిత చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతేడాది ఏప్రిల్‌లోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా సెప్టెంబర్, అక్టోబర్లో చెరువుల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని చేపట్టాం. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఆదేశాల వస్తే చేప పిల్లల పంపిణీకి చర్యలు చేపడుతాం.

– ఆర్ఎల్.మధుసూదన్, జిల్లా మత్స్యశాఖ అధికారి

అడెల్లిలో భక్తుల సందడి



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. శనివారం రాత్రి నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు ఆదివారం తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనంకోసం బారులు తీరారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ కుటుంబ సభ్యులతో సహా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. - సారంగపూర్



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

'ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'

లోకేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ముష్కం రామకృష్ణాగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో లోకేశ్వరం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులను గుర్తించడానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. అమరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేల పింఛన్, ప్రభుత్వ ఉద్యోగం, ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని, 250 చదరపు గజాల ఇళ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాకేటి లస్మన్న, జాదవ్ పుండలిక్‌రావు, జనార్దన్‌రెడ్డి, గంగుల చిన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ

అధ్యక్షుడిగా సంటెన్న, ఉపాధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా సుదర్శన్ రెడ్డి, సలహాదారులుగా శ్రీధర్, చిన్నారావు, కోశాధికారిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ఖానాపూర్‌లో రైతులు, వ్యాపారుల ఆందోళన

- మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా, రాస్తారోకో
- దుకాణాల ఏర్పాటును అడ్డుకుంటున్నారని నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యాపారులు, రైతులు

ఖానాపూర్: పట్టణంలోని వారసంతలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనువైన స్థలం చూపించకుండా మున్సిపల్ అధికారులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆదివారం పలువురు వ్యాపారులు, రైతులు ఆందోళన నిర్వహించారు. గతంలో 108 ఎమర్జెన్సీ పేరుతో రోడ్డుపైన ఉన్న తమను అకారణంగా తొలగించారని, అయినప్పటికీ తాము సమీపంలోని వీధుల్లో రోడ్ల వెంట నాలుగు వారాలు దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నామన్నారు. తైబజార్ చెల్లిస్తున్నప్పటికీ ఆదివారం తమను మున్సిపల్ అధికారులు వ్యాపారం చేసుకోనివ్వకుండా అడ్డుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము దుకాణాలు ఏర్పాటు చేయకుండా దుకాణాల స్థానంలో మున్సిపల్ కార్యాలయానికి చెందిన చెత్త ఆటోలు, చెత్త ట్రాక్టర్‌లు, వాటర్ ట్యాంకర్‌లు, వైకుంఠ రథం, తదితర వాహనాలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా చేశారు. అయినప్పటికి స్పందన రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేపట్టారు. ఎస్సై లింబాద్రి వారిని సముదాయించడంతో ఆందోళన విరమించారు.

లక్ష్యానికి మించి..!



- జిల్లాలో పూర్తయిన ధాన్యం కొనుగోళ్లు
- 1.58 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ

భైంసాటౌన్: జిల్లాలో యాసంగి సీజన్ 2023–24 ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసింది. గత నెలాఖరుతోనే కొనుగోళ్లు ముగియాల్సి ఉండగా అకాల వర్షాల నేపథ్యంలో కొద్దిపాటి ఆలస్యం జరిగింది. ఎట్టకేలకు లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయింది. జిల్లాలో డీఆర్‌డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్, జీసీసీ ఆధ్వర్యంలో మొత్తం 228 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సీజన్‌లో 1.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేయగా అంతకుమించి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. అకాల వర్షాలు, ఈదురుగాలులతో ధాన్యం తడిసి రైతులు ఇబ్బంది పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు లేక పంట ఉత్పత్తులు కాపాడుకునేందుకు తిప్పలు పడ్డారు. ఎట్టకేలకు ఆలస్యమైనా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేశారు.

91.93 శాతం ట్యాబ్ ఎంట్రీ...

జిల్లాలో మొత్తం 38,113 మంది రైతుల నుంచి 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దాదాపు అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించారు. వీటిలో 1.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయాలకు సంబంధించి ట్యాబ్ ఎంట్రీలు పూర్తయ్యాయి. ట్యాబ్ ఎంట్రీ పూర్తయిన వాటికి సంబంధించి డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతాయి. ఇప్పటివరకు రూ.320.12 కోట్ల ధాన్యం విక్రయాలకు సంబంధించి ట్యాబ్‌లో నమోదు కాగా 29,990 మంది రైతులకు రూ.271.02 కోట్లు వారి ఖాతాల్లో జమయ్యాయి. ఇంకా 12,759.920 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయ వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాల్సి ఉంది. వీటికి సంబంధించి రైతులకు డబ్బులు అందాల్సి ఉంది.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఇలా...

ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు : 228
కొనుగోలు లక్ష్యం : 1,45,730 మె.ట
కొనుగోలు చేసింది : 1,58,071.960 మె.ట
ధాన్యం విక్రయించిన రైతులు : 38,113
రైతులకు చెల్లించాల్సిన మొత్తం రూ.320.12 కోట్లు
ఇప్పటి వరకు చెల్లించింది రూ.271.02 కోట్లు
డబ్బులు పొందిన రైతులు : 29,990

ప్రశాంతంగా గ్రూప్‌-1 ప్రిలిమ్స్ పరీక్ష



బాలికల కళాశాల వద్ద అభ్యర్థులను చెక్ చేస్తున్న సిబ్బంది



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్



పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

- 3,633 మంది అభ్యర్థులు హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను అమలు చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్ష జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేశారు. జిల్లాలో 78.8 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రాంతీయ సమన్వయకర్త ప్రొఫెసర్ పీజీ రెడ్డి తెలిపారు. మొత్తం 13 పరీక్షా కేంద్రాలలో 4,608 మంది అభ్యర్థులకుగానూ 3,633 మంది పరీక్ష రాయగా 975 మంది గైర్హాజరయ్యారు. జిల్లా యంత్రాంగం ముందస్తుగానే విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో ఎలాంటి ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా ప్రిలిమ్స్ పరీక్షలు ముగిసాయి. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. అభ్యర్థుల హాల్ టికెట్లను ఆధార్ వంటి గుర్తింపు కార్డులతో సరిచూసుకున్న తర్వాత మెయిన్ ఎంట్రెన్స్ వద్ద ప్రతీ ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు.

కలెక్టర్ తనిఖీ

గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. నిర్మల్ పట్టణంలోని వశిష్ఠ, విన్నర్ పాఠశాలలు, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. అభ్యర్థులు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్‌సీ గంగారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

సాంస్కృతిక కళావైభవం చాటేది నృత్యమే



ప్రశంస పత్రాలతో విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: సాంస్కృతిక కళావైభావాన్ని చాటి చెప్పేది నృత్యమేనని, దీని ద్వారా సామాజిక చైతన్యంతో పాటు మానసిక ఆనందం కలుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం వెన్నెల డ్యాన్స్ అకాడమీ 16వ వార్షికోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని అర్కే కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, ప్రముఖ పద్య కవి బి.వెంకట్, వెన్నెల డాన్స్ అకాడమీ డైరెక్టర్ ఏ.ధన్‌రాజ్, ప్రముఖ జానపద గాయకుడు శనిగారపు నాగరాజు, డాక్టర్ చంద్రిక, జగతి, ఆడెపు శ్రీధర్, గురుస్వామి మూర్తి, నిర్మల్ జిల్లాకు చెందిన కళాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు-ఆంగ్లం సమేతంగా..

- ద్విభాష పాఠ్యపుస్తకాల పంపిణీకి సిద్ధం
- ఈ విద్యా సంవత్సరం నుంచే 'పది'విద్యార్థులకు..
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రయోజనం




ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయనున్న పాఠ్యపుస్తకాలు

నిర్మల్‌ఖిల్లా: మారుతున్న కాలానుగుణంగా మార్పులు చేసుకుంటూ ప్రభుత్వ విద్య ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. ఆంగ్ల మాధ్యమం ద్వారా ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించే అవకాశం ఉంది. ఇందుకుగాను పాఠ్యాంశాల రూపకల్పనలో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని విద్యాశాఖ భావిస్తోంది. ఈ క్రమంలో గత మూడేళ్ల క్రితం నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టింది. ఏటా ఒక్కో తరగతి పెంచుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం బోధించనున్నారు. గతంలో సక్సెస్ పాఠశాలల పేరిట కొన్ని ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఆంగ్ల మాధ్యమ బోధన కొనసాగించారు. 2022–23 విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం ప్రారంభించారు. విద్యార్థులు పాఠాలు తేలికగా అర్థం చేసుకునేందుకు పుస్తకాల ముద్రణలో మార్పులు చేశారు. ఇందులోభాగంగా పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశాన్ని ఒక పక్క తెలుగు, మరోవైపు ఆంగ్లంలో ముద్రించడం విశేషం.

పంపిణీకి ఏర్పాట్లు

మరో రెండు రోజుల్లో పాఠశాలల బడి గంటలు మోగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి ద్విభాష పాఠ్యపుస్తకాలు పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఉచిత పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకోగా, మండలాల్లోని పాఠశాలలకు పంపిణీ ప్రక్రియ జరుగుతోంది. అయితే గత విద్యాసంవత్సరం వరకు 9వ తరగతి వరకు ద్విభాష (తెలుగు, ఆంగ్ల భాషలో) ప్రచురితమైన పుస్తకాలు పంపిణీ చేయగా, ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు ఆ మాదిరిగా పుస్తకాలు అందజేయనున్నారు.


రెండువైపులా రెండుభాషల్లో ముద్రితమైన పాఠ్యాంశంలోని పేజీ(ఫైల్)

రెండు విభాగాలుగా పుస్తకాలు..

ప్రతి పుస్తకాన్ని ఆంగ్లం, తెలుగులో ముద్రిస్తే పుస్తకం పేజీల సంఖ్య రెట్టింపై విద్యార్థులకు బరువు పెరగకుండా రెండు విభాగాలుగా విభజించారు. పార్ట్–1, పార్ట్–2 పేరిట విభజించిన రెండు పుస్తకాలను జూన్ నుంచి అక్టోబర్ వరకు మొదటి భాగం, నవంబర్ నుంచి మార్చి వరకు రెండవ విభాగాలుగా విద్యార్థులకు, ఈ సంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు పుస్తకాలు అందజేయనున్నారు. తద్వారా ద్విభాషా పాఠ్యపుస్తకాల వల్ల విద్యార్థులు సులభతరంగా నేర్చుకునేందుకు వీలుంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

తెలుగు, ఆంగ్లమాధ్యమాల్లో పాఠ్యాంశాలు..

తెలుగు మాధ్యమం నుంచి వచ్చిన గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల మాధ్యమం చదవాలంటే కొంత ఇబ్బందిగా ఉంటుందని భావించిన విద్యాశాఖ ప్రతి పుస్తకాన్ని రెండు భాషల్లో ముద్రించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషా పుస్తకాలు కాకుండా గణితం, సామాన్య, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలు ఎడమవైపు పేజీలో తెలుగులో, కుడివైపు పేజీలో అదే పాఠ్యాంశాన్ని ఇంగ్లిష్‌లో ముద్రణ చేయించారు. ఇక ప్రాథమిక స్థాయినుంచి పదో తరగతి వరకు అన్ని పాఠ్యపుస్తకాల్లో రెండు మాధ్యమాల్లో సులభంగా చదువుకునే అవకాశం ఉంది. ఇది విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉండనుంది.

కొత్త హంగులతో పుస్తకాలు..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే పుస్తకాలు కొత్త హంగులతో రూపొందించారు. ఆకట్టుకునే చిత్రాలు, కవర్ పేజీలతో ఉండనున్నాయి. పేజీలోని పాఠం పూర్తి వివరాల కోసం, సంబంధిత వీడియోల కోసం అక్కడ క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. మొబైల్‌తో స్కాన్ చేయగానే అదనపు సమాచారంతో కూడిన వీడియో, ఫోటోలు అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇవి విద్యార్థులకు సరికొత్త ఆకర్షణీయంగా ఉన్నాయి.

పంపిణీకి ఏర్పాట్లు



ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పుస్తకాల ముద్రణ పూర్తయింది. పాఠశాల ప్రారంభం రోజునే పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయులకు బోధన అభ్యసన ప్రక్రియ సులువవుతోంది.

– డాక్టర్ ఏ.రవీందర్ రెడ్డి, డీఈవో

విద్యార్థులకు అవగాహన సులభం



గ్రామీణప్రాంత విద్యార్థులకు పాఠం అవగాహన కోసం సులభతరం అవుతోంది. ద్విభాషా పుస్తకాల విధానం ద్వారా మెరుగైన ఫలితాల సాధనకు తోడ్పడుతుంది. ఉపాధ్యాయులకు ప్రయోజనం. పుస్తకాలు రెండు పార్ట్‌లుగా ఉండటం వల్ల విద్యార్థులపై భారం ఉండదు.

– మైస అరవింద్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, పొన్కల్

క్లుప్తంగా

కండక్టర్‌కు గుండెపోటు


బాసర ప్రభుత్వ ఆస్పత్రిలో నేలపై కండక్టర్

బాసర: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కండక్టర్ శోభన్‌కు ఆదివారం గుండెపోటుకు గురయ్యాడు. బస్ డ్రైవర్ వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నేలపై కండక్టర్ ఉన్నా నర్సులు, సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. ఆ సమయంలో అక్కడే ఉన్న మాజీ సర్పంచ్ రమేశ్ తన కారులో భైంసా ఏరియాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, పశువుల కొట్టం దగ్ధం


కాలిపోయిన ఇల్లు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బాబాపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి 2 గంటలకు షార్ట్ సర్క్యూట్‌తో కవల్కర్ లక్ష్మి ఇల్లు, కవల్కర్ సురేష్‌కు చెందిన పశువుల కొట్టం దగ్ధమైంది. చుట్టు పక్కలవారు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. వారు అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ఆర్‌ఐ సాయిప్రసాద్ పంచనామా నిర్వహించారు. కవల్కర్ లక్ష్మికి చెందిన 4 తులాల బంగారు, రూ.4 లక్షల నగదు, 5 క్వింటాల్ బియ్యం, నిత్యావసరాలు, టీవీ, మంచాలు దగ్ధమైంది. కవల్కర్ సురేష్‌కు సంబంధించి పశువల కొట్టంలో 40 బస్తాల డీఏపీ, 70 బస్తాలు యూరియా, వరి గడ్డి కాలిబూడదైంది. సుమారు రూ.1.50 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

కారు ఢీకొని నీలుగాయ్ మృతి


మృత్యువాతపడ్డ నీల్‌గాయ్

దిలావర్‌పూర్: కారు ఢీకొని నీలుగాయ్ మృతిచెందింది. మండలంలోని కాల్వ నరసింహ స్వామి ఆలయ స్వాగత తోరణం వద్ద ఆదివారం తెల్లవారుజాము ఈ ఘటన చోటు చేసుకుంది. భైంసా వైపు నుంచి వస్తున్న కారు వెళ్తుండగా అడ్డంగా నీలుగాయ్ రావడంతో ఢీకొట్టింది. దీంతో దూరాన పడి మృత్యువాత పడింది. కారును అధికారులు రోడ్డు పక్కన ఉంచారు. ఎఫ్ఎస్ఓ ఫారూఖ్ అలీ, ఎఫ్‌బీఓ మీనాలు నీలుగాయ్‌కి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. దిలావర్‌పూర్ పోలీసులు సైతం పరిశీలించారు.

అస్వస్థతతో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుడు ఏముర్ల రాజయ్య (56) శనివారం అస్వస్థతకు గురై మృతిచెందాడు. అమరవాది గ్రామానికి చెందిన రాజయ్య శనివారం అమ్మాగార్డెన్స్ ఏరియాలో విధులు నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. అతన్ని తోటి కార్మికులు ఇంటి వద్ద విడిచిపెట్టగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు 108లో మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దహనసంస్కారాలకు కాంగ్రెస్ నాయకులు రూ.10వేల ఆర్థికసాయం చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బోథ్: మండలంలోని పూల్‌సింగ్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ భాస్కర్(58) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాము కథనం ప్రకారం.. భాస్కర్ కుటుంబ పోషణ కోసం రూ.2 లక్షల అప్పు చేశాడు. ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి..

తిర్యాణి: మండల కేంద్రానికి చెందిన ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన చిన్న పోషయ్య (55) మంచిర్యాల జిల్లా మందమర్రిలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, తిర్యాణిలో ఆయనకు సంబంధించిన వ్యవసాయ భూములు ఉండటంతో వాటిని చూసుకునేందుకు మూడు రోజుల క్రితం ఇక్కడే ఉంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్‌సాగర్ (చెలిమల) ప్రాజెక్టు కాలువ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

వాగులో పడి పశువుల కాపరి మృతి

రెబ్బెన: మండలంలోని నంబాల పరిధిలో గల మన్నెగూడకు చెందిన టేకం శంకర్ (52) ఆదివారం ప్రమాదవశాత్తు గోలేటి వాగులో పడి మృతి చెందాడు. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గోలేటి పరిధిలోని దుర్గాపూర్‌కు చెందిన నాందేవ్ వద్ద పశువుల కాపరిగా శంకర్ పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా ఉదయం మేత కోసం గోలేటి వాగు పరిసరాలకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. తోటి కాపరులు గమనించి నాందేవ్‌కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని శంకర్‌ను ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుమారుడు విలాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య


నాగ్‌నాథ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని సట్వాజీగూడ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. కుమురం భీం జిల్లా లింగాపూర్ మండలం మామిడిపల్లికి చెందిన నాగర్‌గోజే నాగ్‌నాథ్(35)కు ఆదిలాబాద్ జిల్లా సట్వాజిగూడకు చెందిన పార్వతితో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా పార్వతి కొన్ని రోజులుగా పుట్టింట్లో ఉంటుంది. నాగ్‌నాథ్ ఆదివారం సట్వాజీగూడకు వచ్చాడు. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది అత్తగారి వ్యవసాయ చేనులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు 108లో రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందాడు.

మద్యం మత్తులో యువకుడి..

బేల: మండలంలోని చప్రాల గ్రామంలో యువకుడు తిరస్‌కార్ వినోద్(20) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై కినక జీవన్ కథనం ప్రకారం.. వినోద్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి ఇంటి వద్ద మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి, ఇరుగుపొరుగువారు రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి, మృతిచెందాడు. తల్లి సంగీత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఉరుకులు.. పరుగులు





ఆదిలాబాద్‌లో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్షకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో అభ్యర్థులు కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. చివరి నిమిషాల్లో సమయం మించిపోతుండడంతో మరికొందరు ఇలా ఉరుకులు పరుగులు పెడుతుండగా 'సాక్షి'క్లిక్ మనిపించింది.- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

కేంద్రం చిరునామా తెలియక..




నిర్మల్‌లో గ్రూప్–1 పరీక్ష కోసం కేటాయించిన కేంద్రం చిరునామా తెలియక అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. కేంద్రానికి ఆలస్యంగా చేరుకోవడంతో అనుమతించలేదు. పోలీసు కార్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రెండింటి ప్రవేశ ద్వారాలు ఒకటే ఉండడంతో గందరగోళానికి గురయ్యారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా


నవనీత్


చరణ్ తేజ్


అఖిల్


శివ

- జిల్లా నుంచి పలువురు విద్యార్థులకు ర్యాంకులు
- విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే వినోద్, ఆర్సీఓ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచాటారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థులు జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించి మెరిశారు. ఈసారి 9 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, ఆడే నవీన్ 1171 ర్యాంకు తెచ్చుకుని కళాశాల టాపర్‌గా నిలవగా, మిగతా ముగ్గురిలో దుర్గం చరణ్‌తేజ్ 2778, వెలుతురు అఖిల్ 3679, రాంటెంకి శివ 7476 జాతీయ ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. జేఈఈలో క్వాలీఫై అయిన సదరు విద్యార్థులకు జోసా కౌన్సెలింగ్‌లో సాధించిన ర్యాంకు ప్రాతిపదికన ఐఐటీలో సీటు కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన

సదరు విద్యార్థులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి ఫోన్ ద్వారా అభినందించారు. ఈ సందర్భంగా సీఓఈ ప్రిన్సిపాల్ సైదులు, అధ్యాపకులను ప్రశంసించారు. వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, అధ్యాపకులు నాగిని శ్రీరామ వర్మ, పిన్నింటి కిరణ్, చందా లక్ష్మీనారాయణ, మిట్టా రమేశ్, కట్ల రవీందర్, ముద్దసాని శోభ, ఆవునూరి రవి, అల్లూరి వామన్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు


చంటి


సాయికృష్ణ

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ (బాలుర) కళాశాలలో కొనసాగుతున్న స్టార్ 50లోని పలువురు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించారు. ఇందులో పి.చంటి ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 422 ర్యాంకు, ఎస్.సాయిక్రిష్ణ ఎస్టీ కేటగిరీలో 743వ ర్యాంకు జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ కనబర్చారు. శివకుమార్ నీట్‌లో ఎస్సీ కేటగిరీలో 40,887 ర్యాంకు సాధించారు. మరికొందరు ఈఏపీసీఈటీ, ఎన్ఐటీ రంగాల్లో సీట్లు సాధించనున్నట్లు స్టార్ 50 కోఆర్డినేటర్ మారుతి శర్మ తెలిపారు.

ఆదిలాబాద్‌లో..



ఆదిలాబాద్‌టౌన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచా టారు. గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన టీచర్ శివకుమార్–గీతా రాణి దంపతుల కుమారుడు కార్తీక్ ఓబీసీ కేటగిరిలో 1794వ ర్యాంక్ సాధించాడు. అదేవిధంగా నవీన్ యాదవ్–రమాదేవి దంపతుల కుమార్తె సిరి జాతీయ స్థాయి ఓబీసీ కేటగిరిలో 2236వ ర్యాంక్ సాధించింది.

వాంకిడిలో..



వాంకిడి: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన దుర్గం అర్జున్ ప్రతిభ చాటారు. ఆలిండియా స్థాయిలో 1782వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రులు దుర్గం మహేందర్–జ్యోతి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, కళాశాల సిబ్బంది అర్జున్‌ను అభినందించారు.

ఉట్నూర్‌లో..



ఇంద్రవెల్లి: ఉట్నూర్ మండలం నర్సాపూర్‌కు చెందిన చవాన్ జైవంత్‌రావ్, అలిమా దంపతుల కుమార్తె మేఘ్న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అలిండియా 68 ర్యాంకు సాధించారు. విద్యార్థిని ఈ ప్రాంత ప్రజలు అభినందించారు.

నర్సాపూర్(జి)లో..



నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన విశ్వక్‌సేన్ జేఈఈ (అడ్వాన్స్‌డ్) ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 1833 ర్యాంక్ సాధించాడు. తండ్రి నరేందర్ ప్రభుత్వ టీచర్ కాగా, తల్లి అనురాధ గృహిణి.

నిర్మల్‌లో..



నిర్మల్‌ఖిల్లా: ఇంద్రానగర్‌కు చెందిన గుర్రం రమాదేవి–వేణుగోపాల్ దంపతుల కుమార్తె సాయి మనోజ్ఞ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 2,514 జాతీయస్థాయి ర్యాంకు సాధించింది. ఆమెను పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్ దంపతులు సన్మానించారు.

విజయరాజ్‌కు 210వ ర్యాంకు



జన్నారం/లక్ష్మణచాంద: జన్నారం వాసి, లక్ష్మణచాంద లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీజీ హెచ్ఎం భుక్య రాజునాయక్–రూప దంపతుల కుమారుడు విజయరాజ్ జేఈఈ (అడ్వాన్స్‌డ్) ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 210 ర్యాంక్ సాధించాడు. విజయ్‌రాజును పలువురు అభినందించారు.

అ'పూర్వ' సమ్మేళనం



చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వీరి అపూర్వ సమ్మేళనానికి స్థానిక సంతోషిమాత ఫంక్షన్ హాల్ వేదికైంది. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురువులను సన్మానించారు.



రామకృష్ణాపూర్: పట్టణంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. 34 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా మొదటిగా పాఠశాలలో కలుసుకుని అక్కడి నుంచి ర్యాలీగా క్లబ్‌కు చేరుకున్నారు. డీజే సౌండ్స్‌కు స్టెప్పులు వేస్తూ ఉత్సాహంగా ర్యాలీ చేపట్టారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ చిన్ననాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.



లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.